# ఖైదీ

జైయిల్లో పడ్డ కొత్తలో కన్నయ్యకు ఏమీ తెలిసేది కాదు. ఓ రోజు మొక్కలకి గొప్పు తవ్వమన్నారు. అప్పటికే అక్కడ కొంతమంది పని చేస్తున్నారు.

"ఏంరోయ్, ఎదవ నాగన్నా! ఎన్నేళ్ళేశా రేటి?" బుగ్గమీద భయంకర మైన కత్తి గాటున్న కొండిగాడు అడిగాడు.

"ఆడినేం మాటాడించ కెహ! ఉట్టి సత్తికాలపోడు. ఆడి కరమ సిత్స అనుబగించడం."

"ఒరేయ్, కన్నిగా! సేతు లూపు కుంటూ లార్డులా వత్తన్నాడు చూశా?" అడిగాడు కొండిగాడు.

వస్తున్న జవాను వైపు మెల్లగా తల తిప్పాడు కన్నయ్య.

"మా పెళుసు నాయాలు, ఓటిచ్చుకుంటా - సూత్తావేటి?"

ఓ రాయి తీసి రివ్వున విసిరాడు కొండిగాడు.

తలమీద దెబ్బ తగిలింది జవానుకి. రక్తం బడబడా కారిపోతోంది.

వార్డర్లు పరుగెత్తుకొచ్చారు. కన్నయ్యకు గుండె లబలబలాడింది. తుపాకీ బట్‌తో మక్కెమీద పొడిచాడు కొండిగాడిని వార్డర్. అతను ఎత్తబోయిన బొరిగెను మరో వార్డర్ తీసుకొని అవతల విసిరేశాడు.

"ఈ నా కొడుకుల కిదే మందు!" కంఠంలో కోపం, కళ్ళలో నీళ్ళు, దెబ్బ చాలా బలంగా తగిలి ఉండాలి.

బరబరా ఈడ్చుకుపోయారు కొండిగాడిని.

ముసలి వార్డర్ అన్నాడు : "ఈళ్ళిప్పుడంటే ఏసాలేస్తన్నరు గాని దొరలకిందా, నా సావిరంగా వార్డర్లు బూటు కాల్తో తన్నితే, బూటు అచ్చు పడేది మక్కమీద!"

ఓ వారం తరవాత చేతులకి గొలుసులతో కనపడ్డాడు కొండిగాడు. నాగన్న కేక లేశాడు: "ఎదవకానా! ఎన్నిసాల్లు సెప్పినా ఇనుకోవు. ఆళ్ళ నో దెబ్బేస్తే కంటికి కనబడని సన్నులు తన్నుతారు మన్ని. తిండెట్టకుండా సీకటి కొట్లో జంతువునాగ ఇసిరీసేరా? ఇప్పటికైనా బుద్ధిగా మసులుకో!"

"ఈ గొలుసు లూడిపోనీ, రగతం కల్లజూత్తా!"

కొండిగాడు మాటలు విన్న కన్నయ్య "సెగ్గుమాలినోడు" అని మనసులోనే అనుకున్నాడు.

•••

స్నేహితురాలి పెళ్ళికి బయలుదేరింది వనజాక్షి, యలమంచిలి. కారు పెళ్ళి వారి ఇంటికి చేరేసరికి చీకటి పడుతూంది. యమున పరుగు పరుగున బయటికి వచ్చి స్నేహితురాలిని తన గదిలోకి తీసుకెళ్ళింది. మరుసటి రోజే పెళ్ళి.

ఇల్లంతా హడావిడిగా ఉంది.

కాఫీ కప్పు చేత్తో పట్టుకునే అడిగింది వనజాక్షి : "ఎవరే ఆ శేఖర్! వెడ్డింగ్ కార్డు మరీ అంత సింపుల్‌గా వేయించా వేమిటీ?"

"హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు అయిదేళ్ళనుంచీ. ఎమ్.ఎల్., ఉస్మానియా!"

"కంగ్రాచ్యులేషన్స్. అయితే, హైకోర్టులోనే పెడతావన్న మాట ఇక నీ ప్రాక్టీసు. అప్పీలు పంపుతాలే. ఫీజు మాత్రం ఫిఫ్టీ, ఫిఫ్టీ!"

"చాల్లేవే. ఆయనగారికి ఆడవాళ్ళు ఉద్యోగం చేయడం అస లిష్టంలేదట." యమున గొంతులో నిరాశ వనజాక్షి విషయం మార్చేటట్లు చేసింది.

"విడిది ఎక్క డిచ్చారు?"

"ఈ వీధిలోనే ఆ పెద్ద మేడలేదూ? నాయుడుగారిది. అదే. పెళ్ళి కూడా అక్కడే. నాయుడుగారు మా ఊళ్ళో మోతుబరి. అతని కొడుకును నువ్వు చూసి తీరాలి. క్వైట్ ఎ కారెక్టర్!"

కబుర్లు చెప్పుకుంటూ పదింటి వరకు కూర్చున్నారు.

వనజాక్షి పందిట్లోకి వెళుతూనే చూసింది తన వంకే చూస్తున్న ఒకతన్ని. పళ్ళికిలిస్తూ ఓరగా చూస్తున్నాడు. జులపాలూ, బెల్‌బాటమ్, చేతిలో సిగరెట్టూ...హంగులన్నీ ఉన్నా, ఎరువు తెచ్చుకున్నట్లు ఎబ్బెట్టుగా ఉన్నాయి.

బట్టల్లో కనబడే నాజూకుతనం, ఆధునికతా మొహంలో లేవు.

యమున చెప్పినమాట గుర్తొచ్చింది. నాయుడుగారి కొడుకు గంగరాజు అతనే అయి ఉంటాడు. రెండేళ్ళు ఇంటర్మీడియట్ చదివి చదువు వంటపట్టక వదిలేశాడు. తనను ఎదిరించిన వాళ్ళ ఎముకలువిరిపించేస్తాడట. గంగులంటే ఆడపిల్లలకి హడలనీ, చెల్లెలివరసే తనను కాపాడిందనీ చెప్పింది యమున.

అతిథులంతా ఒకరొకరే వచ్చి కూర్చుంటున్నారు, లగ్న వేదిక ముందు. పాలేరులా ఉన్నాడు ఓ అబ్బాయి, బకెట్టుతో నీళ్ళు పట్టుకొస్తూ కాలు జారి పడ్డాడు. నీళ్ళు ఒలికిపోయాయి. గభాలున వాణ్ణి లాగి ఓ చెంపదెబ్బ కొట్టాడు ఓ సిల్కు చొక్కా ఆసామీ. కుడిచేతి వేళ్ళన్నింటికి ఉంగరాలు.

చెప్పక్కర లేకుండానే తెలిసిపోయింది వనజాక్షికి అతను ఆ ఇంటి యజమాని అనీ, జులపాలు తండ్రనీ. బిత్తరపోయి చూస్తూ కూర్చుంది వనజాక్షి

ఓ పల్లె పడుచు నీళ్ళు ఒత్తుతూంది. ఆమె వంగి పని చేస్తుంటే ఆమె ఒంపులను టక్కరిగా చూస్తున్న నాయుడు కొడుకు ఆ అమ్మాయి పిరుదు మీద చిన్న దెబ్బ వేశాడు. పల్లెపడుచు ముడుచుకుపోయింది కోపంతో, సిగ్గుతో.

చటుక్కున లోపలి కెళ్ళిపోయింది ఆమె.

కూర్చున్న వాళ్ళెవరూ గంగరాజు చేష్టలను గమనించలేదు. చూసినా, చూడనట్టు ఊరుకున్నారేమో! ఎంత చూడకుండా ఉందామనుకున్నా ఆ గంగులు ఏవేవో వెకిలి చేష్టలతో తనను ఆకర్షించడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

ఎంత వేగం లగ్నం అయిపోతుందా, వెళ్ళిపోదామా అని చూస్తోంది వనజాక్షి. మంగళసూత్రధారణ అయిపోయింది. తను తెచ్చిన ఉంగరం యమున వేలికి తొడిగి, మరుసటి రోజు కేసొకటి వాయిదా ఉందని చెప్పి సెలవు తీసుకుంది. కారులో కూర్చుని ఇగ్నిషన్ కీ తిప్పుతూ వరండా మీదకు చూసింది.

పళ్ళికిలిస్తూ కనపడ్డాడు జులపాలు.

ఒళ్ళు మండింది. కారు స్టార్ట్ చేసి క్లచ్ వదిలింది. కుదుపుతో కారు బయలుదేరింది.

•••

వడ్రంగి మాస్టారు చెప్పారు కన్నయ్యకి - కొత్త సూపరింటెండెంటు గారు కొండిగాడిని పిలిచి ఏదో చెప్పారట. అతనిలో ఇప్పుడొచ్చిన మార్పు అందరినీ ఆశ్చర్యపరుస్తూంది.

కొత్త దొరగారు ఛార్జీ పుచ్చుకున్నప్పటి నుంచీ ఒక్కొక్క ఖైదీని పిలిచి వాళ్ళతో ఏదో మాటాతున్నారట.

ఒకనాడు కన్నయ్యకూ వచ్చింది పిలుపు. కార్పెంట్రీ షెడ్‌లో ఉండగా. వడ్రంగి మాస్టారు - "జాగ్రత్త!" అంటూభుజం మీద తట్టి పంపారు.

దొరగారి గదిలోకి అడుగు పెట్టాడు కన్నయ్య. తల దించుకుని ఏదో చదువు కుంటున్నారు దొరగారు.

"కన్నయ్యంటే నువ్వేనా?"

"చిత్తం!"

"చేతులు కట్టుకో అక్కర్లేదు దించేయ్!"

తనవైపు చూడకుండానే దొరగారికి తను చేతులు కట్టుకున్నట్టు ఎలా తెలిసిందని ఆశ్చర్యపోయాడు కన్నయ్య.

"ఇక్కడి కొచ్చాక ఏమైనా పని నేర్చుకున్నావా?"

"చిత్తం, వడ్రంగి పని......"

"గుడ్! ఇక్కడి కొచ్చాక ఎప్పుడన్నా ఎందుకు చేశానా ఈ నేరం అనే విచారం పశ్చాత్తాపం కలిగాయా నీకు?"

"చిత్తం! కానైతే నే నే నేరం సేయనేదు!"

"అబద్ధం ఆడకూడదని నీకు తెలియదా?

కన్నయ్య దుఃఖం కట్ట తెగి కన్నీళ్లు వచ్చాయి.

"తప్పుచేసిన తరవాత అయినా పశ్చాత్తాపపడడం మనిషిలో మానవత్వాన్ని ఋజువు చేస్తుంది. శిక్ష పడ్డాక కూడా దబాయిస్తే ఏం లాభం?"

"సెమించాలి. నామాటెవరూ నమ్మనేదు. సత్తెపెమానంగా సెబుతున్నా, నే నే పాప మెరగను."

దొరగారు బల్లమీద గంట నొక్కి కుర్చీలోంచి లేచి కిటికీ వద్ద నించున్నారు.

"కాల్ ది రికార్డ్ క్లర్క్!"

గదిలోకి రాబోతున్న వార్డర్ బయటకు వెళ్ళాడు.

కన్నయ్యకు వణుకు వస్తూంది.

ఎవరో ఒకాయన వచ్చాడు గదిలోకి. "గెట్ మి ది జడ్జిమెంట్ కాపీ ఆఫ్ దిస్ మాన్"?

కన్నయ్య ముతక బనియను మీద నూటపదిహేను నంబరు చూసి బయటకు వెళ్ళా డతను.

వెనకకు తిరిగారు దొరగారు. తన కళ్ళలోకి సూటిగా చూసి కుర్చీలో కూర్చుని కాగితాలు చదవడం ప్రారంభించారు, ఆ కొత్తాయన కాగితాలు పట్టుకొచ్చాక.

విగ్రహంలా నించున్నాడు కన్నయ్య.

"నువ్ చెప్పిన మాట లెవరూ నమ్మలేదన్నావ్. నువ్ అసలేం చెప్పావ్?"

"దేన్ని గురించి, బాఁవూ?"

"నువు చేసిన నేరాన్ని గురించి."

"నేనే పాపఁవూ సేయినేదు. నాయుడు కళ్ళంలోకి పన్లో కెళ్ళాను. రంగమ్మ కూతుర్ని నాయుడు కొడుకు బలాత్కారం సేత్తుంటే అడ్డఁవడ్డాను. ఆడి సెయ్యిరిగి పోనాది. కోర్టు ఎంట తిప్పినారు. ముసిల్ది మాయమ్మ జడుసుకుంది. కత్తి సూపించి మా నాయనదేనా అనడిగితే ఒప్పేసుకుంది. డబ్బు దొంగతనం సేసేవా అని అడిగినారు. లేదన్నాను. సిచ్చ ఎలానూ తప్పనేదు. సెయ్యని తప్పుకి పచ్చాత్తాపంకూడా ఎలా పడను? మీరెలా సెబితే అలాగే సేత్తా. దరమపెబువులు."

కన్నయ్య దడదడా మాటాడేశాడు. దొరగారు మళ్ళీ బెల్లు కొట్టారు. వార్డరు కన్నయ్యను కొట్లోకి తీసుకుపోయాడు.

తరువాత చుట్టూ చేరారు అన్నయ్య లందరూ.

"ఎట్రోయ్ ఇసేచికం? దొరగారి దగ్గర కెళ్ళావు, ఏటన్నారేటి?"

అంతా తన వంక చూస్తుంటే తన కదోలా అనిపించింది.

"ఖైదీ వెందుకయ్యావని అడిగారు. ఆరు నమ్మనేదు, మీనాగే!"

"ఓరి, సన్నాసీ! నువ్ నిజంగా పిచ్చోడివిరా. సిచ్చ ఉట్టినే పడద్దా?"

"ఈ రెండు మాటలకే ఇంత సేపా? నువ్వేదో కూసేస్తే నాలుగేశారేమో, ఏడుస్తా ఎక్కడో కూకున్నావేమో ననుకున్నా!" అందరూ నవ్వారు.

•••

కరుణాకరరావుగారు ఫైలు మొదటి నుండి మళ్ళీ చదివారు. కోర్టువారి తీర్పులో ఏ మాత్రం ఆక్షేపణలకి ఆస్కారం లేదు. కాని, కన్నయ్య ప్రత్యేకతని గురించి కార్పెంట్రీ ఇన్‌స్ట్రక్టర్ ప్రత్యేకంగా చెప్పాడు. వార్డర్లు చెప్పారు. తన ముందు ఆఫీసర్ వెళ్ళిపోతూ వ్రాసిన ఇన్‌స్పెక్షన్ రిపోర్టు తన ముందే ఉంది.

తన వృత్తి ధర్మం ఖైదీల క్షేమ సమాచారాలు చూడడం, వాళ్ళను శిక్షణలో పెట్టడం, వాళ్లలో ఆత్మవిమర్శను పెంచి పశ్చాత్తాపపడేటట్లు చెయ్యడం, వాళ్ల కాలం, ప్రభుత్వ నిధులు దండగ కాకుండా ఉపయోగించే పనులు వాళ్ల చేత చేయించడం.

శిక్ష అనుభవించిన తరవాత ఖైదీ మారిన మనిషై సంఘానికి ఉపయోగిస్తే తను తన పనిని సక్రమంగా చేసి నట్టే.

ఇంటికి వచ్చి ఆలోచనతోనే భోజనానికి కూర్చున్నారు.

"ఏమిటో ఆలోచిస్తున్నారు?" ఎదురుగా కూర్చున్న పెద్దమ్మాయి అడిగింది.

"న్యాయం నా పూచీ కాదు....కాని, తోటిమనిషికి న్యాయం చేకూర్చడం లేదన్న అనుమానం నా ఉద్యోగధర్మాన్ని అధిగమించడానికి నన్ను పురి గొల్పుతుంది. నువ్ చెప్పమ్మా! మనిషిగా నువ్ న్యాయమనుకున్న పని చెయ్యలేకపోవడం కంటే చావేదైనా ఉందా?"

"తోటి మనిషికి న్యాయం చేకూర్చడం మీ బాధ్యత కాదనుకుంటే, అది నాదని నేను గర్వం..

చెప్పుకుంటాను. మీ మనసులోని విషయం నాకు చెప్పండి."

"అదేవిఁటే మీ నాన్నగారితో, అన్నం తినడం మానేసి నువ్వూ దంచేస్తున్నావ్ లెక్చరు! తండ్రీ కూతుళ్ళకి భోజనాల దగ్గర తప్ప ఇంకెక్కడా తీరిక చిక్కదా వితర్కానికి?" విసుక్కుంది దొరగారి భార్య.

ఆమె వంక చూసి నిట్టూర్చారు కరుణాకరరావుగారు.

భోజనాలయాయి. వక్కపొడి తెచ్చి ఇచ్చింది. పెద్దమ్మాయి.

"పద, ఆఫీసుకు వెళదాం!"

కారు జైయిలు ఆవరణలో ఆగింది. ఇద్దరూ ఆఫీసులోకి వెళ్ళారు.

"ఇదిగో, జడ్జిమెంటు కాపీ. జాగ్రత్తగా చదువ్!"

"ఈ తీర్పులో ఆశ్చర్యకరమైన విషయం ఏమీ లేదు. కాకపోతే ఎటెమ్‌టెడ్ మర్డర్, థెఫ్ట్ ఋజువయ్యాక వెరిడిక్ట్ లీనియంట్‌గా ఉన్నట్టే ఉంది."

"నా మనసులో నే నేమనుకున్నాసరే, కోర్టు తీర్పును ఆక్షేపించే హక్కు నాకు లేదు."

"అంటే, ముద్దాయి నేరస్థుడు కాడనే మీ ఉద్దేశ్యమా? అలా అయితే, అతను పైకోర్టుకు అపీలు చేసుకోలేదెందుకు?"

"న్యాయం ఖరీదైంది కాబట్టి; చాలా మదుపు కావాలి కాబట్టి. ఏ ఖైదీ తను నిర్దోషినని అదే పనిగా, నిజంగా నేరస్థుడైతే చెప్పడు, పిచ్చివాడైతే తప్ప. కన్నయ్యను పిలిపించి చూశాను. నా ఇరవైఅయిదేళ్ళ సర్వీసులో జరగనిది జరిగింది. అతని కళ్ళలోకి చూడలేక నేనే కళ్ళు తిప్పుకోవలసి వచ్చింది.....తోటి మనిసికి న్యాయం చేకూర్చడం నీ ధర్మమని గర్వంగా చెప్పుకుంటా నన్నావ్. కన్నయ్యకు నువ్ చెయ్యగలిగిందేమైనా ఉందేమో ఆలోచించు."

"ఏదీ జడ్జిమెంటు?" జాగ్రత్తగా చదువుదా మనుకుంది మరోసారి.

"వాది యలమంచిలి గ్రామ కాపురస్థుడు కన్నయ్య నాయుడు కొడుకు గంగరాజు..."

చటుక్కున్న జ్ఞాపకం వచ్చాడు జులపాల గంగన్న.

"ఆ కన్నయ్యను ఓసారి పిలిపిస్తారా?"

"ఖైదీలను విజిటర్స్ చూడడానికి నిర్ణీతమైన వేళలున్నాయి. సాయంకాలం అయిదు నుండి అయిదున్నర."

తండ్రి దృక్పథం అర్థం చేసుకుంది వనజాక్షి.

•••

ఇద్దరు వార్డర్లు వెనక నడుస్తుండగా కన్నయ్య వచ్చాడు. వార్డర్లు దూరంగా నించున్నారు. టైము అయిదు గంటల రెండు నిమిషాలైంది.

"కన్నయ్యంటే నువ్వేనా?"

"సిత్తం!"

"నువ్ నిజంగా నేరం చెయ్యలేదా?"

"దైవసాచ్చి! నేనే పాపఁవూ ఎరగను."

"జరిగిన విషయం జాగ్రత్తగా చెప్పు. నీకు ఇరవైఅయిదు నిమిషాలే టైముంది. ఏదీ దాచకుండా

జరిగినది జరిగినట్టు చెప్పు."

తను కూలి కోసం నాయుడి కళ్ళానికి వెళ్ళడం మొదలు శిక్ష పడిన వరకూ జరిగినదంతా చెప్పాడు, మాటలు వెతుక్కోకుండా.

కన్నయ్య తరపున వకీలు లేకపోవడం, తన మీద ఆరోపణలు అసలు తన కర్థం కాకపోవడం, బొత్తిగా చదువురానివాడూ, దిక్కులేనివాడూ కావడమే జడ్జిమెంటు వెనక ఉన్నట్టు కనిపించింది వనజాక్షికి.

అతని మాటలు పూర్తి అవగానే తను చెప్పవలసింది ప్రారంభించింది వనజాక్షి :

"కన్నయ్యా! నీ తరపున కోర్టులో అపీలు చేసే ఏర్పాటు చేస్తాను. చట్టరీత్యా కేసు మళ్ళీ విచారణకి వస్తుంది. నీ కేం భయం లేదు. న్యాయం గుడ్డిదని ప్రజలు అనుకోవచ్చు. కాని, ఎప్పుడూ చట్టం వ్యక్తి హక్కులు భద్రపరిచేటట్టు రూపొందించబడుతుంది" తక్కున ఆగిపోయింది, తన ఉద్వేగంలో కన్నయ్య తలకు మించిన భాష మాటాడేస్తున్నదని గ్రహించి.

చిన్న మాటలతో తన సానుభూతినీ, ఉత్తేజాన్నీ అతని కందించి తప్పక న్యాయం చేకూరుతుందనే విశ్వాసాన్ని అతనిలో కలిగించి బయటకు వచ్చింది.

●●●

పద్ధతి ప్రకారం అపీలు నమోదవడానికి కొంత కాలం పట్టింది. కాని, నమోదైన వెంటనే నాయుడు కొడుక్కి సమన్లు వెళ్లాయి. హుటాహుటి విశాఖపట్నం వచ్చి ఓ ముసలి క్రిమినల్ లాయర్‌ను పెట్టి వెళ్ళాడు నాయుడు.

వనజాక్షి ఒకటికి రెండు సార్లు తన సీనియర్ వద్ద సలహా పుచ్చుకొని కేసు ప్రిపేర్ అయింది. కోర్టులో కేవలం న్యాయం చేకూరుద్దామనే ఉత్సాహంతో జరిగినది జరిగినట్టు కోర్టువారి ఎదుట నిరూపించింది. రంగి కూతుర్నీ, రంగినీ తెప్పించి పని అయ్యేవరకూ వాళ్ళను తన ఇంటిలోనే ఉంచుకుంది.

రెండు మూడు సార్లు కేసు వాయిదా పడి, చివరకు మూడు రోజులు పట్టింది కేసు హియరింగ్ పూర్తి కావడానికి.

గంగమ్మ సాక్ష్యం బలంగా కోర్టు వారు నమ్మేటట్టుంది.

నాయుడు జులుం చేసే స్వభావం కలవాడని చూపడానికి అతని మీద నాటు సారా కేసులు చాలా తెలివిగా, ఆసరాగా తీసుకుంది వనజాక్షి.

గంగులు తాగిన మైకంలో కొట్టి గాయపరచబడ్డ ఇద్దరు వ్యక్తులు అతని నిజస్వరూపం బయట పడేటట్టు గట్టిగా సాక్ష్యమిచ్చారు, ఆమె తెలివిగా వారిని కేసులోకి రప్పించడం వల్ల.

నాయుడు డబ్బు ఖర్చుపెట్టి కన్నయ్య నేరాలు చేసినట్టు చూపిన ఋజువులు ఋజువులు కావని వాదించింది. నిజానికి గంగులు చెయ్యి విరిగినప్పుడు గవర్నమెంటు ఆస్పత్రికి వెళ్ళి కట్టు కట్టించుకున్నప్పుడు ఎద్దు తోసేసి నట్టు తనతో చెప్పినట్టు డాక్టరు సాక్ష్యం ఇచ్చాడు.

ఇక, కత్తితో కన్నయ్య గంగుల్ని హత్య చేయబోయాడన్నది పూర్తిగా కట్టుకథ అనీ, నిజానికి ఆ కత్తి కన్నయ్య ఎన్నడూ చూడలేదనీ, కోర్టులో అతని తల్లి ఆ కత్తి ఆమె భర్త దన్న విషయం ప్రశ్న వెనక

కీలకం తెలియక ఒప్పుకుందనీ, అది ముద్దాయి నేరాన్ని ఋజువు చెయ్యలేదని, లాయరు ప్రశ్నలూ, చేష్టలూ కన్నయ్యకు కాని, అతని తల్లికి కాని నిజంగా అర్థంకాలేదనీ, వారు మభ్యపెట్టబడ్డారనీ.... ఒక్కొక్క పాయింటూ విన్నవించింది వనజాక్షి కోర్టు వారికి.

జైలు వార్డర్లూ. తోటి ఖైదీలూ కన్నయ్య స్వభావాన్ని గురించి సాక్ష్యమిచ్చారు. అది న్యాయస్థానమని మరిచిపోయి న్యాయానికి కళ్ళు లేవనీ, చెప్పుడు మాటలు విని తీర్పులు చెప్పబడతాయనీ, లాయర్లకు కావలసింది డబ్బనీ, వారు కాపాడేది ధనవంతులననీ తన సొంత బాణీలో రంకెలు వేశాడు కొండిగాడు.

పిడకల వేట లాంటి ఈ సన్నివేశంలో ఖైదీ ఉద్రేకం కన్నయ్య అమాయకత్వానికి ఋజువుగా తీసుకోవాలనీ, కొంచెం లీనియన్సీ చూపించి కంటెంప్టు ప్రొసీడింగ్స్ విరమించుకోవాలనీ మధ్యలో లేచి విన్నవించుకోవలసి వచ్చింది వనజాక్షికి.

చివరగా జైలు సూపరింటెండెంటు కన్నయ్య ప్రవర్తన మీద రాసిన రిమార్కులు కోర్టు వారిచే పరిశీలింపబడ్డాయి. ఈ సాక్ష్యాలన్నిటి మీదా కోర్టువారు కన్నయ్యను నిర్దోషిగా నిర్ణయించి తక్షణం విడుదల చెయ్యాలని తీర్పు ఇచ్చారు.

మిగిలిన తీర్పు వినలేదు వనజాక్షి.

గంగులు కళ్ళలోని విభ్రాంతిని చూసి వనజాక్షి తృప్తిగా నవ్వుకుంది. కోర్టు బయట కరుణాకరంగారు కారులో వనజాక్షి కోసం ఎదురుచూస్తున్నారు. ఆమె వెనకాలే వచ్చి కన్నయ్య ఆమెకు తన కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

"అమ్మాయిగోరూ! తమ రెవరోకాని నాకు గొప్ప మేలు సేసినారు. మీ మేలు మరిసిపోను." కాళ్ళకు దండం పెట్టాడు కన్నయ్య.

"నేను జైలు సూపరింటెండెంటుగారి అమ్మాయిని. నువ్వు ఇప్పు డెక్కడికి వెళతావ్?"

"వండ్రంగం మేట్టారింటి కమ్మా!"

"సరే, ఈ డబ్బు నీ దగ్గరుంచుకో!"

దండంపెట్టాడు దొరగారికి. కారు కదిలిపోయింది.

చింకి చొక్కా, ఇరుకైపోయిన పాంటూ, జేబులో ఇరవై రూపాయలూ చూసుకున్నాడు కన్నయ్య.

మూడో రోజే కన్నయ్యకు పని దొరికింది, ఆదిశేషయ్యగారనే ధనవంతుడి ఇంట్లో. నమ్మకస్థుడైన పనివాడు కావాలని చాలా రోజులుగా ప్రయత్నం చేస్తున్నారట. అన్ని పనులూ చేతనయి ఉండాలట. బంట్రోతూ, తోటమాలీ, వడ్రంగి- అన్నీ ఒకడై ఉండేటట్టుగా ఎంచుకోవా లనుకుంటున్నారట. డబ్బుకి ఖాతరులేని మనుషులు. వాళ్ళు చెప్పినట్టు వినుకోవాలట.

వెంటనే పనిలో చేరాడు. వారి ఇంట్లోనే ఓ షెడ్డులో బస ఇచ్చారు. వంటమనిషి అతనికీ వడ్డించేది వేళకి గది అవతల. పెద్ద ఇల్లు. ఇల్లంతటికి ఇద్దరే మనుషులు- ఆదిశేషయ్యగారూ, కుమార్తె వినోదిని.

వినోదిని భర్త అమెరికా వెళ్ళారట సంవత్సరమై. ఇంకో రెండేళ్ళ వరకు రారట. తండ్రీ కూతుళ్ళు. కన్నయ్య చెయ్యవలసిన పనులు చెప్పారు.

కన్నయ్య కష్టాలు గట్టెక్కాయని తెలిసి సంతోషించిన వాళ్ళలో ముఖ్యులు రంగమ్మా, గంగమ్మా, కన్నయ్య వ్రాయించిన ఉత్తరం అందుకుని జవాబు వ్రాయించింది రంగి. ఉత్తరం అందుకున్న తరువాత మెల్లగా చిన్నమ్మ గారితో చెప్పాడు కన్నయ్య.

చిన్నమ్మ గారికి కన్నయ్యంటే ఎంతో అభిమానం. తను ఎక్కడ పనిచేస్తున్నా, వచ్చి అలా దూరంగా నించుని చూస్తుంటారు.

"మీ రెందుకమ్మా ఎండలో నిలబడాలా, లోన కెళ్ళండమ్మగోరూ!" అంటాడు కన్నయ్య. ఆమె వినిపించుకోదు.

ఊరు కెళతానంటే ఎవరున్నారని అడిగింది వినోదిని. రంగమ్మత్తుందన్నాడు కన్నయ్య. తండ్రితో చెప్పి సెలవు ఇప్పించింది. ఓ పది కాగితమూ ఇచ్చింది.

•••

బస్సు దిగగానే రంగమ్మ ఇంటికెళ్ళాడు కన్నయ్య.

కన్నయ్యను కౌగిలించుకుని పిడికెళ్ళు కణతలమీద పెట్టి దిష్టి తీసింది రంగి. స్నానానికి నీళ్ళు తోడి తెమ్మంది గంగిని. నరి కూడూ, చేపల కూరా కమ్మగా చేసి వడ్డించింది.

గంగమ్మ కొప్పుముడి చుట్టుకుని, మల్లె దండ పెట్టుకుని దేవతలా కనపడింది. కన్నయ్యకు ఒళ్ళు పులకరించింది.

"మా గెయిరమ్మోది నుంటేనా, ఇన్నాళ్ళు సెయికుండే దేటి? ఆ పాపిట్టి ముండ కొడుకు నా తల్లి మీద కన్నేసి ఈ అరాచకాని కొడికట్టునేటి? ఏదైనా బగమంతు డున్నాడు. పులి కరిచి బయటొడ్డాన్, బుల్లోడా! నా మా టిను. ఒయసొచ్చిన బొట్టి. రోజులు బాగోనేవు. నువ్ దాని మెళ్ళో తాళి కట్టేత్తే నా పేనం కుదుట బడద్ది. ముసిలిముండనింకెనానల్లు బతకాల?"

ఈ మాటలు వింటున్న గంగి పరుగెట్టు కుంటూ బాదం చెట్టు కిందకు పారిపోయింది. కూడు తిన్నాక బయటపడు కుంటానన్నాడు కన్నయ్య. నులక మంచం తెచ్చి వేసింది పెరట్లో రంగి. గుడిసెలో పడుకుంది. గంగి.

బాదం చెట్టులోంచి పడుతున్న వెన్నెలలో కిందనున్న పచ్చ గడ్డి మిలమిలా మెరుస్తూంది. చందమామ వైపు చూస్తున్న కన్నయ్య గాజుల గలగల విని లేచి కూర్చున్నాడు మంచం మీద.

"రాయే గంగీ! రా, కూకో..."

గంగి వెనకాడుతుంటే చెయ్యి పట్టుకుని లాగి కూర్చోపెట్టుకున్నాడు.

"అదేటె అది, అలా మెరిసి పోతుంది?"

దగ్గరికెళ్ళి చూశా రిద్దరూ.

"ఏంనేదు మావా, అద్దం పెంకుమీదెన్నెల."

"ఓస్, అదేటో ననుకున్నా."

ఇద్దరూ వచ్చి మంచం మీద కూర్చున్నారు.

"ఏటేశ్! మూగ దాయిలా కూకున్నావ్! చెప్పేస్, ఇశేచికాలు?"

"పో, మావా!

"గంగీ! నన్ను చేస్కోడం నీ కిట్టమేనటే.... మీ యమ్మనీ తీసుకుపోదాం!"

..............

" ఏం, మాటాడవ్?"

" నీ ఇట్టం, మావా!"

ఒడిలోకి తీసుకొని పొదివి పట్టుకున్నాడు. అతని ఒడిలో ఆమె ఓ క్షణంపైై మరిచిపోయింది.

"ఎవరో వస్తున్నట్టుంది. మాఁవా! తుళ్ళిపడ్డాడు కన్నయ్య."

నవ్వుతూ పారిపోయింది గంగి గుడిసెలోకి.

పంతులుతో మాటాడి ముహూర్తం పెట్టించమని బస్సెక్కాడు కన్నయ్య మరుసటి రోజు.

"సొంత ఊరు వెళ్ళావ్ - పెళ్ళి కూతుర్ని చూడ్డానికా?" మెరుస్తున్న అతని కళ్ళలోకి చూస్తూ అడిగింది వినోదిని.

ఉలి సానపెట్టే ప్రయత్నంలో ఉన్నాడు కన్నయ్య.

"పోండమ్మగోరూ! మీ కన్నీ పరాచికాలే... నాలుగు రోజులై ఎదురుసూస్తన్నారు. చిన్నయ్యగో రుత్తరం ఏశేరా?"

"అఁ మన మెక్కడ జ్ఞాపకంలెద్దూ అయనగారికి!"

" ఏ దమ్మా, ఓ నూనె బొట్టు!"

" తెస్తా...." లోపలి కెళ్ళి సీసా పట్టుకొచ్చింది.

" ఇదెందు కమ్మగోరూ, తలకు రాసుకునీది?"

" ఫరావాలేదులే. అది నువ్ తీసుకో. నేను మరొకటి కొనుక్కుంటా."

" చిత్తం."

" నన్ను వినోదినిగారూ అని పిలువ్. ఎంతో బాగుంటుంది."

వింతగా తల ఎత్తి చూసిన కన్నయ్య కళ్ళలోకి చూసి ముసిముసిగా నవ్వులు నవ్వింది వినోదిని.

తల దించుకుని గుండురాయి మీద నూనె బొట్టు వేసి ఎడమచేతి మునివేళ్ళతో ఉలిని నొక్కి పట్టి కుడిచేత్తో సానపెడుతున్నాడు కన్నయ్య.

కండలు తిరిగిన కన్నయ్య జబ్బల వైపే చూస్తూంది వినోదిని.

ఉలి మొన మీదికెత్తి పదును చూసి నూనె ఓ గుడ్డ పేలికతో తుడిచేశాడు. ధగధగలాడింది ఉలి.

కన్నయ్యా! నీ పని తరువాత చేసుకుందువు గాని, మేడ మీద నా గదిలోకిరా. మంచం కొంచెం బాగుచెయ్యాలి.

గదిలోకి అడుగు పెట్టగానే సువాసనలో మునిగిపోయాడు కన్నయ్య.

"ఏంటమ్మోయ్! ఈ ఓసన?"

"కేవ్డా. అంటే మొగలి అత్తరువు. చూస్తావా? ఇలా రా." బీరువాలోంచి తీసి కన్నయ్య బనియను కింత పులిమింది.

గది చుట్టూ కలియ జూశాడు కన్నయ్య. మూడు పక్కలా కిటికీలు. ఎండను వడపొసే అందమైన నీలితెరలు, ఓ పక్క అందమైన జోడీ మంచాలు, గోడమీదనుంచి చిన్నయ్యగారు తనపక్కే చూసి నవ్వుతున్నారు.

"ఇలా చూడు!" మంచం మీద కూర్చుని అటూ ఇటూ ఊగింది వినోదిని.

కియ్ కియ్ మని చప్పుడయింది మంచం.

"నిద్రలో కదిలినప్పుడు మంచం చప్పుడైతే ఎంత చిరాకుగా ఉంటుందో తెలుసా?"

"అఁ.... ఇట్టే బాగుసేత్తా!" మంచం మీది డన్‌లప్ పరుపును చుట్టబోయాడు.

నవ్వింది వినోదిని. పరుపు చుట్టబడలేదు.

"చేద్దువుగానిలే, ఏం తొందర? ఇంకా చాలా టైముంది... అన్నట్టు ఈ బొమ్మలు చూశావా?"

బీరువాలోంచి తీసిన ఆల్బంలో ఓ ఫోటో చూపించింది.

"ఛీ ఛీ! ఇదేం టమ్మోయ్! బూతు బొమ్మలు...."

"వెర్రివాడివోయ్. ఇది చూడు ఎంత బాగుందో..."

కన్నయ్య గుండెలు దడదడ కొట్టుకున్నాయి. "ఈ అల్బం ఖరీదెంతో తెలుసా? అయిదు వందలు. ప్రత్యేకం బొంబాయినుంచి తెప్పించాం."

మరో ఫోటో తీసి చూపుతూంది.

కన్నయ్యకు కాళ్ళు లొటలొట లాడిపోయాయి.

అదను చూసుకుని మంచం మీదకు లాక్కుంది. కన్నయ్య తమాయించుకోబోయాడు.

"కన్నయ్యా! కాదనకు. పోనీ.... ఈ ఒక్కసారీ..."

ఆమె గొంతులోని జీర ...... కన్నయ్య గొంతు తడి ఆరిపోయింది.

"వద్దమ్మా, వద్దు."

"ఏమిటో కన్నయ్యా, నీ పిచ్చిగాని, ఇప్పు డిక్కడ ఎవరున్నారు, చెప్పు?"

"అరుగో!" గోడవంక చూపాడు కన్నయ్య.

"ఓస్, అదా! అసలు చినబాబుగారు ఏమని రాశారో తెలుసా? అమెరికాలో ఇల్లాంటివేవీ ఎవరూ పట్టించుకోరట...."

పెనుగులాడడం ప్రారంభించాడు కన్నయ్య. పెనుగులాటలో ఆమె పైట.... అలా చూస్తూ ఉండిపోయాడు.

అదేసమయమని ఆమె అతణ్ణి మంచం మీద వెల్లకిలా తోసేసి నిలువునా....

ఆమె అన్వేషణ ప్రారంభం కాగానే బలంగా ఆమెను తోసేసి మెట్లు దిగి గబగబా కిందకు వచ్చాడు.

సామాన్లు షెడ్‌లో పడేసి గొళ్ళెం వేసి గేటు వైపు నడిచాడు.

పైట సవరించుకుంటూ మెట్లు దిగి వెనకాలే వచ్చింది వినోదిని.

"కన్నయ్యా! వెళ్ళకు, ప్లీజ్!"

ఆమె పిలుస్తూనే ఉంది. గేటు దాటి ఇవతలకు వచ్చేశాడు.

కొంతదూరం వచ్చాక తేరుకున్నాడు. ఇప్పుడేం చెయ్యాలి?

వడ్రంగం మాస్టారుతో చెబితే?

పెద్దింటోళ్ళ జోలి కెళితే ఎటు తిరిగి ఏమవుతుందో! ఆమె గుట్టు రచ్చకెక్కితే తనకేం ఒరుగుతుంది?

ఇల్లు ఖాళీ చేసేస్తే? మళ్ళీ పని దొరక్కపోతే? పోనీ, అయ్యగారు వచ్చిన వరకూ ఉంటే... ఎందుకో గుండె లబలబ లాడింది.

గంగిని పెళ్ళి చేసుకొని చల్లగా తిరిగి వస్తే....... తనతోనే ఉంటుంది. అప్పుడు ఆమె తన మీద పడలేదు కదా?

స్టేషన్ కెళ్ళి రైలెక్కాడు.

●●●

కరుణాకరరావుగారు సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నారు. టెలిఫోన్ మోగింది. ఫోన్ వైపు ఎర్రగా చూసిఎత్తాడు.

"హలో... స్పీకింగ్... ఆదిశేషయ్యగారా? ..... గుడ్ ఈవెనింగ్.... వాట్? మీ ఇంట్లోనే, రవ్వల నెక్లేసా?..... కన్నయ్యా.... అరెస్టు చేశారా? అయాం సారీ!"

న్యాయం తన బాధ్యత కాదన్న తన నమ్మకాన్ని మనసు కటకటాల వెనక ఖైదు చేసుకుని బరువుగా నిట్టూర్చారు కరుణాకరరావుగారు.

ఆంధ్రప్రభ 1.10.75